# మన వూళ్లో కూడా నా....?!

మధ్యాహ్నం ఎండ మిటమిట లాడిపోతున్నది. వడ్లగింజవేస్తే పేలగింజ అయేంత వేడి. వేడిలోకి వేడి నల్లగొండజిల్లా వేడి. చాలా పేరు మోసిన వేడి. అందరినీ హడలుగొట్టేంత వేడి.

లోకల్ ఫండు చెల్లిస్తున్నా నోసటిరాత మారని పల్లెటూరి బాట. ఎండకు తళతళా మెరుస్తున్నది ఇసుకతో నిండిన బాట. క్రింద భూమి, పైన ఆకాశం భగ్గున మండిపోయే వైశాఖమాసం.

కనీసం గంటకు పదిమైళ్ళ వేగాన్నయినా అందుకోవాలన్న తాపత్రయంతో కచ్చడం బండీ పరుగెడుతున్నది. మెళ్ళో మూగలు ఘల్లు ఘల్లున మోగుతూ కోడెల అడుగులకు తాళం వేస్తున్నాయి. కచ్చడం వెనుక లేచిన దుమ్ము చిన్న చిన్న మేఘాలను సృష్టిస్తున్నది.

రేగిన దుమ్ము కండ్లలోకి, ముక్కుల్లోకి పోతున్నా మాదిగ పాపయ్య మాత్రం ఆగటానికి వీల్లేదన్నట్లుగా తననేదో రాక్షసశక్తి తరుము కొస్తున్నట్లుగా కచ్చడం బండీ ముందు పరుగుదీస్తున్నాడు. భుజానికి కర్ర, దానికి తగిలించిన లాంతరు, పాపయ్య అడుగులకు మడుగులొత్తు తున్నట్లు వూగుతున్నది.

నెత్తిన ధొరోరి బట్టల సందూకాతో కచ్చడం బండి వెనుక చాకలి సర్వయ్య సాగిపోతున్నాడు. చెమటలు కక్కే శరీరంతో శ్వాస నిగ్గ దీసుకొని పరుగుదీస్తున్నాడు.

మెత్తని బూరుగుదూది పరుపుమీద కూరుకుపాట్లు పడుతున్నాడు పాపారావు ధొరగారు. పెద్ద దిండుకు ఆనుకొన్న శరీరం, కుదుపులకు ఏమీ బాధపడకుండా అన్నిదిక్కులా తలగడాలు అమర్చి వున్నాయి.

కచ్చడంలో ఒరిగిన అజాను బాహు విగ్రహం, ఉబ్బు చెంపలు, నిమ్మకాయలు నిలబెట్టగల నల్లని మీసాలు, శరీరఛాయకూడ నల్లనిదై, ఎప్పుడూ నీడన వున్నందున నిగనిగ లాడ్తున్నది.

"చిన్నగ పోనిస్తావేంరా ? నడవనీ బండీ."

ఈ మాత్రం హెచ్చరికకే యెద్దుల వీపు "చడేల్" "చడేల్"మని మోగాయి, సేవకుడి వెంకయ్య చేతిలోని కొంచకర్ర వాద్లు.

బండి వేగం మరింత హెచ్చింది. బండి ముందున్న పాపయ్య, సర్వయ్య పరుగు వేగంకూడ తదనుగుణంగానే హెచ్చింది.

దొరవారు కునుకుపాట్లుపడే సమయంలో పాపయ్య, సర్వయ్యా ఇద్దరూ ధొరోరి వెంకన్నతో (వెంకన్నలాంటి వాళ్ళకు యింటిపేర్లుండవు లెండి) ఒక ఒప్పందాని కొచ్చారు. ఆ ఒప్పందానికి ఫలితంగా వెంకన్న కడుపునిండా కల్లు దక్కుతుంది.

వెంకన్న జేయాల్సిన పని బండి వేగాన్ని తగ్గించడమే. తద్వారా చెమటలు కక్కే, సర్వయ్య, పాపయ్య శరీరాలకు కొంతైనా విశ్రాంతి దొరుకుతుంది.

బండివెంట సరిగ్గా రానందున దొరగారు వడ్డించే తిట్లకన్నా, భయంకరమైన కొచ కర్రదెబ్బలైనా తప్పుతాయి.

కాని ఎవరు బాధ్యులైతేనేం ? ఒప్పందం భగ్నమైపోయింది.మండు టెండలో కచ్చడంబండీ మహా జోరులంకించుకొంది. వగిరిస్తూ ముందు పాపయ్య, వెనక సర్వయ్య ఉరుకుతున్నారు. అడ్డూ, అదుపూ లేని అధి కారం గల దొరవారి ఉగ్రనారసింహావతారం, దాన్ని కాపాడేందుకు కాపలాగావుండే దొరోరి వెంకన్న, చేతిలోని కొచకర్ర ఈ రెండూ మహా భయంకరంగా కళ్ళకు కట్టినట్లు సర్వయ్య, పాపయ్యలపైన తమ నీడలను దృశ్యా దృశ్యంగా ప్రసరింపజేస్తున్నాయి.

బ్రతకలేక బడిపంతులుగా దొరవారి వూళ్ళోవున్న స్నేహితుని కలవాలని నా తాపత్రయం. పాతరోగాలు బయటపడ్డట్లుగా యెండకు పాత పంచర్లు వూడిపోయే పాత సైకిలుతో ప్రయాణమయ్యాను.

పట్నవాసానికి పది ఆమడల దూరం ప్రయాణానికి బండైనా కావాలి, లేక కాలికైనా బుద్ధిచెప్పాలి. బుద్ధివచ్చేటంత బలమైన కాళ్ళుగావు కనుక పాత సైకిలే శరణ్యమైపోయింది. పాడుబాటలో బండీతో కూడ సరిగ్గా నడిపించలేకపోయాను. బట్టలన్నీ తడిసి ముద్దయిపోయినాయి. బండికంటే వెనుకపడ్తే పరువెక్కడ పోతుందోనన్న రోషంతో వగిరిస్తూ సైకిలు తొక్కుతున్నాను.

"ఏయ్! దొరగారు కచ్చడంలో వున్నారు. కోడెలు బెదుర్తై—దూరంగా పో" భయంకరమైన తన మిడిగుడ్లను వెళ్ళబెట్టి బెదిరించాడు ధొరోరి వెంకన్న. బండి యెడ్లు కనబడకుండా వెనకనే వుంటుంది నాకు ప్రాణ సమానమైన పదేండ్లనాటి పాతపురాణం సైకిల్....సైకిళ్ళయినా, మోటార్లయినా తొలిగి బండ్లకు దారివ్వవలసిందే, ఈ కచ్చడంబండ్ల రాజ్యంలో—అసలు సంగతి తర్వాత తెలిసింది. దొరవారి కచ్చడం కన పడ్డాక సైకిలు దిగి నడవాల్సిందేనట. ఎక్కి పోవటానికి వీల్లేదట.

ఎడారి యెండలో ఒయాసిస్‌లాగ దొరవారి వూరు "కడపురం" వచ్చింది. కచ్చడం బండీ వెనుకా, ముందూ వున్న మా అందరి కష్టాలూ గట్టెక్కినట్లయింది.

చాకలి, మంగలి వాడలకు దగ్గరలో మకాం పెట్టిన మా స్నేహితుని ఇంటికి చేరుకున్నాను.

నా వెనుకనే బెత్తెడు కడుపు జానెడు లోతుకు గుంజుకుపోయిన పాపయ్యా, నర్సయ్యా అర్ధశేరు జొన్నలేమో మూటగట్టుకొని యిళ్ళు చేరుకున్నారు.

ఎండనబడి వచ్చినందుకు మూడుపాళ్ళ నీళ్ళు, ఒకపాలు అన్నంతో చిన్నప్పుడు చదివి మరచిన ఆరోగ్య శాస్త్ర ప్రకారం భోజనం చేయడమనే

వాలాయితీ ముగిసింది. ఎండకు వూడిపోయిన పంచర్లను అతిక్రిస్తూ మా స్నేహితుని యింటిముందు వరండాలో వున్నాను.

బల్లెం చెక్కిన చేతికర్రతో బీటలుబారిన బిళ్ళ బెల్టు నడుముకున్న నడియీడు మనిషి సర్వయ్యను పిలుస్తున్నాడు:

"అరే ! సర్వా" అని.

"యేం! కాశీమయ్యా !" అంటూ సర్వయ్య ఇవతలకు వచ్చాడు.

"పట్వారీ సాబు జమాబందీకి నల్లగొండకు బోతున్నడు–దఫ్తరం ఒరువొంతు నీదైంది – పదూ."

"నీ యిల్లు బంగారంకాను. యిప్పుడే కదయ్యా – దొరోరి సందూక ఒరువొంతుకు పోయివస్తిని. బువ్వకూడ తినలేదు–నర్సిగాడు లేడూ ? అదే నా తర్వాత వంతోడు."

"గొల్లోళ్ళకాడ వసూలైన మామూలు యాటలిచ్చి రావటానికి అమీన్ కచ్చేరికి పోయిండు."

"అయితే చిన సర్వడు సీతిగాడూ, నారిగాడూ, తక్కినోళ్లు ఎవరూ లేరా ?"

"కొంతమంది మేనా మోసేటందుకు, తక్కినోళ్ళు చినదొర కార్యానికి పిండ్లు విసరటం, ఇండ్లలికి ముగ్గు లేస్తున్నరు. ఇప్పటి వంతు నీదే."

"కాశీమయ్యా ! నిన్న యియ్యాళ్ళకే అందరి వంతులు గిర్రున తిరిగి నాకాడి కొచ్చినట్లున్నది."

"అరే ! యేం చేయమంటవు భై ! పొద్దటి నుంచి కాలి బొట్టె కట్టకుండ తిరుగుతున్నా, ఈ పని ఎప్పటికీ తెగేదికాదు – దొరకాకుంటే చిన్న దొర, వీళ్ళిద్దరు దప్పితే పటేలు పట్వారీలు, సంచులు నింపుకోడాని కొచ్చే పోలీసు ఇన్స్పెక్టర్లు, గిర్దావర్లు ప్రతివాడూ సేక్ సింద్ కు బులావ్ ! కోసిన వరి మొత్తలకు మా బూబమ్మ కావలకి పోయింది. పుర్సత్ ఎక్కడ భై."

ఈ సంభాషణలు వింటూ నా పని నేను చేసుకొంటున్నాను. పంచరు మీద పంచరైంది. దాన్నూడ దీయనా? లేక ఆ అతుకుమీదే ఇంకో అతుకు వేతునా అని ఆలోచనా సముద్రంలో మునకలు వేస్తున్నాను.

ఇంతలోనే "వామ్మో వాయ్యో" అని సర్వయ్య ఇంట్లో నుండి చప్పుడు వినవచ్చింది. నేనూ, మా వాడూ చూడ్డానికి పరిగెత్తివెళ్ళాం—ఇంకా నాకు పల్లెటూరు అలవాటు పోలేదట. మనకేమన్నట్లు పట్టించు కోకుండా పోయే పట్నవాసపు లక్షణాలు నాలో లేవంటున్నాడు మావాడు.

మేమొకళ్ళ నొకళ్ళం విమర్శ, ప్రతివిమర్శ చేసుకొనే అవకాశ మెక్కడున్నది?

ఎదురుగా వరహావతారం మూర్తి వ్యక్తి 'ఇంత ఆలస్యం చేస్తావురా? ........జ కొడకా' అంటూ అమ్మ నాలిని జోకుతున్నాడు. దభీ దభీ మని ఎక్కడ ఏ ఆయపట్టున దెబ్బ తగుల్తుందో నన్న విచక్షణ లేకుండా సర్వయ్యను బాదుతున్నాడు.

మింగుడు బోవటానికి నీళ్ళుపోసుకొని, కారంగలిపిన జొన్న గటక ఎక్కడ నేల పాలవుతుందోనని కొట్టే దెబ్బలు తప్పించుకొంటూ కంచుతట్టతో తనచుట్టు గుడిసెలో కిందా, మీదా పడుతున్నాడు సర్వయ్య.

"నేనైతేనా? నెత్తిన కంచు తట్టని ఎత్తేసి కంట్లో కారం, వంటి నిండా గటక పడి ఈ వరహావతారం తన్నుక లాడుతుంటే లేవంగో తన్ను, పడంగో తన్ను తన్నే వాడ్ని! వీడి ఓర్పు తల్లిముండ మొయ్యా! ఈ సర్వయ్య నోరెత్తడేమిటి?" అని మావాడితో అన్నాను.

"ఇది 'కడపురం' – మీ బస్తీకాదు. గాలికిపోయే కంప మన కెందుకు నోరుమూసుకో. ఇదెప్పుడూ జరిగే కథే!"అన్నాడు మావాడు.

చుట్టుపక్కల వాళ్ళు యల్లయ్య, మల్లయ్యలు గుమి గూడారు.

"కొట్టకు పంతులూ! పెద్దముండాకొడుకు నీ కాళ్ళు మొక్కుతాం! వదులు." అని బ్రతిమిలాడుతున్నారు. కానీ ఈ మంత్రాలకు చింత

కాయలేం రాలడంలేదు. సర్వయ్య వంటిమీద కర్ర దెబ్బలు పడుతునే వున్నాయి. అక్కడ ఎవళ్ళకూ విడిపించే ధైర్యం లేదు.

కాశీం - సాయిబు మాత్రం వీరావేశంతో మధ్యలోకి దూకాడు. కర్రకు కర్ర అడ్డంపెట్టి "ఏం! వాన్ని చంపుతావ్ మహారాజ్!" అన్నాడు.

మాకు కూడ ధైర్యం వచ్చినంత పనైంది. పంతులుగార్ని గుడిశెకివతలకి యీడుచుకొచ్చాం. పంతులుగారికి వళ్ళంతా చెమటబట్టింది. కోపావేశంతో వళ్ళంతా వణుకుతున్నది. కట్టుపంచె గోచీ వూడింది-చెంగులు దోపుకుంటున్నాడు. మాటలు తొక్కబోతున్నవి. కూలబడ్డాడు.

"ఇంత పిచ్చి కోపమైతే ఎట్లా పంతులూ!" అంటున్నారు అక్కడ గుమిగూడిన పెద్ద రైతులు.

కాశీం వైపు కండ్లెర్రజేసి "ఈ జమా బందీలో నీ యినాం జప్తు చేయించపోతే నేను మా నాయన కొడుకును గాదురా! తురకోడా!" అంటూ పంతులుగారు తన యింటివైపు పోయాడు.

"పోవయ్యా మహారాజ్! ఈ ఇనాం భూంతోనే బతుకుతున్నానా యేమిటి? రెక్కలు చల్లగుంటే ఒంటెద్దు బండితో నల్లగొండలో బతుకుతా!" అన్నాడు కాశీం -

గటక తట్ట కిందబెట్టి సర్వయ్య దెబ్బలకు వళ్ళు చిట్లి, నెత్తురు గారుతుంటే ప్రాథమిక చికిత్సకై కాబోలు గాయాలమీద మన్ను బోసుకుంటున్నాడు. తలమీద పెద్ద గాయమైంది.

"ఏడుపు తప్ప కనీసం వీడికి తిట్టడమన్నా రానట్లుంది ఫూల్ కి!" అని సర్వయ్యమీద షికాయతు చేశాను మావాడితో.

"వాళ్ళు కనుక ఈ మాత్రం తట్టుకొని నెట్టుకొస్తున్నారు. నీ వంటి వాడైతే ఎప్పుడో జారిపోయేవాడు. తాచుపామంత వడి, జెరుగొడ్డంత పిరికి, మీ పట్నవాసం బాపతు-" యెదురు దాడి చేశాడు మావాడు.

ఈ లోగా కొంతమంది యువకులు, యువతులు అక్కడికి చేరారు. బాగా కండలు తేలిన శరీరాలు, గ్రీకు విగ్రహాల్లా వున్న వీళ్ళకు స్వేచ్ఛ అనేది వుంటే ఎంతో బాగా రాణించేవాళ్ళనిపించింది. శరీరాను గుణ్యంగా మేధకూడా వృద్ధి అయేది. ఆడవాళ్ళకు, మొగవాళ్ళందరికీ శరీరాల మీద దెబ్బలు అగుపడుతున్నాయి. అట్లు పొంగినట్లుగా దద్దులుకూడా తేలాయి.

"ఇదేమిటి! సర్వన్నా ?"అని అడిగారు వాళ్ళంతా. "మరి మీ వంటి మీద దెబ్బలేమిటి !" అన్నాడు తిరిగి సర్వయ్య.

"సున్నాలేస్తుంటే అద్దంమీద చినుకులు పడ్డయని దొర చేతి బెత్తంతో కొట్టిండు చూడు."

"కారం మెత్తంగ మెదగలేదని కంట్లో జల్లింది దొరసాని."

"బట్టలు వేళకు తేలేదని రూలు కర్రతో కొట్టిండు పటేలు."

"పిండి బిరుసుపడ్డదని చిన్నదొర తండ్రి చెప్పు విసిరితే రొమ్మున తగిలింది. పోరగానికి యెట్లా పాలియ్యాను తాతా!" అని భోరున యేడ్చింది.

సర్వయ్య తల గిర్రున తిరిగినట్లయి "మనం చేసుకున్న పాపం కట్టి కుడుపుతున్నది" అన్నాడు.

"మనలను తన్ని చంపటానికి ఈ దొరలు చేసిన పుణ్యం ఏమిటి ? మనం ఈలా పడ్తూ వుంటే అలుసైపోయింది" అన్నాడొక యువకుడు.

"చిన్నా పెద్దా యెవరితోనూ చెప్పుకునే దిక్కులేదు. అంతా ఇటు వంటోళ్ళే. మనం ఏంచేయగలం !" నిరాశగా అన్నాడు సర్వయ్య.

"ఇట్లూరుకుంటే లాభంలేదు తాతా !" యేమైనా చేయాల్సిందే ! అన్న ఆవేశం అందరిలో పొంగుతున్నది.

"అక్కడెక్కడో పనిబాటలోళ్ళు యెట్టి బందుచేసినారట-ఊరంతా ఒక కట్టుకడ్తే పెద్ద పెద్ద దొరలుకూడ పడిగె నేలకు కొట్టుకొని పూరుకున్నారట!" అన్నాడొకడు.

"అరె! యింకా మీది వుడుకు నెత్తురు.అవేవో సంగాలంట. తాతలు తండ్రులనాడు లేని ఈ 'కొరివి' మన కెందుకురా" అన్నాడు సర్వయ్య.

"యేమన్నా గాని ఆ "కొరివినే" మనం తెచ్చుకోవలసిందే:" అన్నారంతా.

"పోలీసులు, కేసులు, ఖైదులు. ఈ సర్కారంత మనమీద విరుచుక పడ్తది. యేదో ఇంత కలో, గంజో తాగి బ్రతుకుదాంరా!" అన్నాడు సర్వయ్య. దొరలు, దొరల వెనుకనున్న యంత్రాంగమంతా కండ్లకు కట్టినట్లయిందేమో, సర్వయ్యకు.

"తాతా, వయసులో వున్నప్పుడు కర్రతో పులిని జంపిన మొనగాడి వట! యేందీ పిరికి మందు? ఇంతకన్న చెడ్డగేం వుండదు ఖైదుఖానా" అన్నారంతా.

"మొగోనొతే మూడు దినాలు బ్రతకటం మేలు" అన్న సామెత నాకు జ్ఞాపకం వచ్చిందిరా! అమ్మొ! యేమో అనుకున్నాను గాని అగ్ని పర్వతాలు వున్నాయిరా ఒక్కొక్కళ్ళ గుండెల్లో" అన్నాను మా వాడితో.

"ఇప్పుడు పూలు కావటం నీ వంతు" అని మా వాడు మాట విసిరాడు. నాకు చెంప చెళ్ళుమన్నంత పనైంది.

ఆలోచనలతో తల పట్టుకున్న సర్వయ్య గాయాలకున్న మన్ను కిందరాలుతున్నది. తక్కిన పనిబాటల వాళ్ళ పెద్దలంతా గుమికూడారు, యేం చేయాలని.

"కుల పెద్దలు గదాయని అడిగినం – ఈ ఆలోచనలు యిప్పటితో తెగదు-యిన్ని దినాలు మీరు చెప్పింది సాగింది. ఇప్పుడు మేమన్నది సాగవలసిందే" అన్నారు యువకులు, యువతులంతా.

ఈ వెట్టిపీడ విరగడై పోవాలి, యేమైనా చేయాలి. ఇక వూరుకో కూడదు అన్న భావం వాతావరణ మంతా వ్యాపించింది.

"పని బాటలోళ్ళతో బాటు మేముంటాం" అన్నాడు పెద్ద రైతు రంగయ్య. తక్కిన రైతులంతా మేము మా రంగయ్య తాతతో బాటు వుంటామన్నారు.

వెనుక దొరవారి సేరీదారు తరుముతుంటే మాదిగ పాపయ్యా వగిరిస్తూ వురికొస్తున్నాడు.

"గుర్రాన్ని దోమి అరక పట్టక రమ్మంటే నఖరాలు చేస్తున్నాడు గాడిద".... అని తిడ్తున్నాడు సేరిదారు.

వచ్చి గుంపులో కలిశాడు పాపయ్యా. యిక్కడి కట్టుగట్టాలన్న మాటలు వినేసరికి పాపయ్యకు యేనుగంత బలంవచ్చింది.

"అరక గట్టటానికి నీ అయ్య జీతగాణ్ణా?" అన్నాడు పాపయ్యా.

"యేమిరా కూస్తున్నావు!"

"మాటలు మీరకు. వీళ్ళంతా మావాళ్ళే.మర్యాద దక్కదు. జాగర్త. పో యిక్కణ్ణుంచి" అని ఈగను, దోమను తోలినట్లుగా సేరిదారును అంటున్నాడు పాపయ్యా.

మాటకు ముందు "నీ బాంచను" అనే పాపయ్యా స్వరంలోని దృఢత్వం నాకే ఏదో కొత్త స్ఫూర్తి నిచ్చింది.

"శబాష్" అన్న మాట నానోటినుంచి అప్రయత్నంగా వచ్చింది.

బిక్క మొగంతో వచ్చిన దారి బట్టి పోయాడు సేరిదారు.

ఒకవంక తహసిలు చప్రాసీ, ఇంకొక వంక పోలీసు బీటు జవానూ తరుము కొస్తుంటే పెద్దకుమ్మరి నరసయ్యా, సేక్సిందీ కాశీం నురుగులు గక్కుతూ వచ్చి గుంపులో కలిశారు.

నర్సయ్యా చావడిలో నీళ్ళు బెట్టలేదట. కాశీంకోళ్ళు తీసుకరాలేదు. అదీ వాళ్ళ తప్పు.

"ఏయ్! చెప్పేది మీకే. కాశీం సాయిబును, మా నర్సయ్యాను ఏమన్నా అన్నావంటే మేం వూరుకోం" అన్నారు గుంపులో వాళ్ళు.

"అచ్చా బేటా! విలాయతు (ఇంగ్లండు) నుంచి ఇయ్యాలనే దిగినట్లున్నారు. నడూ! దొరకాడికి. పటేలు పట్వారీ లాడనే వున్నారు. బొక్క లిరగతంతారు."

"అంతపని యిక్కడనే జరుగుతది "గుంపులోంచి జవాబు వచ్చింది.

చెప్రాసీ, పోలీసు జవానూ బింకం చెలాయించబోయారు. ఇక్కడ ప్రపంచం మారిపోయిందని వాళ్ళకింకా తెలియలేదు. ఏనుగులా వచ్చినోళ్ళు పీనుగుల్లా వెళ్ళిపోయారు.

"మేం ఈ చాకిరి చెయ్యం. యేం! తలగోసి మొలేస్తరా! అడుగుదాం పదండిరా, ఈ దొరలను" అని సర్వయ్య, పాపయ్య, నర్సయ్య, రంగయ్య, కాశీం వగైరాలు కదిలారు.

వాళ్ళ వెనుక ఆడ, మగ, ఊరు ఊరంతా ముందుకు కదిలింది.

"వెట్టి నశించాలి!" అన్న కేకలు మారుమ్రోగాయి - సముద్రంలా జనం సాగింది.

నిమ్మకాయల మీసం వాలి, గాలికి తూలిపోతుంటే దొరవారు - పటేలు, పట్వారీలతో అన్నారు: "ఈ చిచ్చు మన వూళ్ళో కూడానా....?!" అని.

(1945)